# ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటే చాలు

“సిద్ధ యోగీంద్రులు”

“సద్గురువును తెలుసుకోవాలి లేకుంటే మానవ జన్మకు ఎందుకొచ్చినట్లు పిడకలు ఏరుకోటానికి” అన్నారు శ్రీసాయి. సర్వత్రానిండిన చైతన్య స్వరూపుడయిన సాయిని ఎలా తెలుసుకోవాలి. తెలుసు అని అనుకుంటే, సాయిచరిత్ర తెలుసు తద్వారా వారి లీలలు, చర్యలు, బోధలు తెలుసు అదే సద్గురువును తెలుసుకోవటము అయితే దాదాపుగా బాబాను ఆరాధించేవారందరికి ఆయన గురించి తెలుసు. ఆమాట నిజమే, అయితే ఎన్నో జన్మలనుండి మనల్ని సంస్కరించుకుంటూ వచ్చి ఈ జన్మలో ఆయన వలెనే మనకు భౌతిక రూపాన్ని ఇచ్చి, పిచ్చుక కాలికి దారంకట్టి లాగినట్లు కార్యకారణ సంబంధంగా అనేక మిషలమీద తన వద్దకు మనల్ని లాగిన సాయి. “నేను ఇవ్వగలిగింది పొందదగినవాడు ఒక్కడూ కనిపించలేదు. కనీసం దానివైపు తేరిపారచూడటం లేదు సరికదా పూతలాగా, పిందెలాగా రాలిపోయే వారే కాని గమ్యంచేరేవారే లేరు” అని ఎందుకు అంటారు. మరి సద్గురువు గురించి తెలిస్తే ఆయన ఏమిషమీద తన దగ్గరకు లాగేరో తెలుసుకొని, ఆయన ఇవ్వగలిగింది పొందగలిగినప్పుడే సద్గురువు గురించి తెలిసినట్లు. “సాయి గురించి నాకు తెలిసిన దానిలో ఏకొద్దిపాటి మీకు తెలిసినా ఆయన జగద్గురువు అని ఒప్పుకుంటారు” అని అంటారు అవతార మెహర్‌బాబా. కొద్దిగా ఏమిటి మొత్తం తెలుసు, సాయి “జగద్గురువు” అని మనకు తెలియదా! తెలుసు, కాని తెలియదు. పుస్తక జ్ఞానంద్వారా ఆయన జగద్గురువు అని తెలుసు, అంతటా నిండిన చైతన్య స్వరూపుడు మనలో ఉన్నాడు. ఆయనలోని భాగమే మనము అని మనకు తెలియదు. “నీకు నాకు బేధమనే అడ్డుగోడ ఉంది దానిని క్రూలదోయ్యి. ఎవరికెవరు శత్రువులు ఉన్నదంతా ఒక్కటే” అన్నారు సాయి. అయితే సద్గురువు తెలియబడకుండా మనలో ఉన్న అడ్డుగోడలు ఏమిటో తెలియాలి అంటే సద్గురువును తెలుసుకోవాలి. అంటే ముందు మనగురించి, మనలో దాగిఉన్న అడ్డుగోడల గురించి తెలియాలి.



జీవితంలో మన ప్రయత్నంఅంతా తృప్తి, శాంతి, ఆనందం, సుఖము, సౌఖ్యము మొదలైన ఎన్ని పదాలు చెప్పుకున్నా వాటిని పొందటానికి చేసే ప్రయత్నమే. వాటికోసం చేసే ప్రయత్నంలో అనేక సుఖశాంతులకోసం అంటూ అనేక దుష్కర్మలు చేసి సద్గురువుకు దూరం అయ్యి జన్మను వ్యర్థం చేసుకుంటాము. మన లక్ష్యాలు, వాటికోసం నిరంతరం మనం చేసే ప్రయత్నాలు అన్నీ ఆదిశగానే సాగుతున్నాయి. ఒక వయస్సులో ఒక లక్ష్యం. దానిని చేరుకున్న తరువాత ఇంకోలక్ష్యం తరువాత ఇంకొకటి, మరొకటి ఇలా వయస్సుతో పాటు జీవితానందం కోసం లక్ష్యాలు మార్చుకుంటూ పరుగుతీస్తున్నామే గాని అసలు మానవజీవిత లక్ష్యం ఏమిటో మరచిపోయి స్వతహాగా ఉన్న ఆనందాన్ని వదలి దుఃఖ వలయంలో కొట్టుమిట్టాడుతూ దుఃఖ సాగరంలో మునిగిపోతాము.

కుల,మత, జాతి, స్త్రీ, పురుష బేధం లేకుండా, పసివాడి బోసి నవ్వుచూస్తే మనకు ఆనందం వేస్తుంది ఎందుకు? ఆనవ్వులో ఎటువంటి కల్మషాలు, బేధాలు లేవు. అందుకే ఆనవ్వు చూడగానే అప్రయత్నంగా మన ముఖములో చిరునవ్వు వెల్లివిరుస్తుంది. ఏమీ ఆశించకుండా, కోరకుండా, పొందకుండానే ఆనందం ఎందుకు కలిగింది. అట్లానే ఆ పసివాడి నవ్వులో ఏకోరికా లేదు, ఆశలేదు. “కావాలనే కోరికను విడిచి సర్వగతుడైన భగవంతుని మీద మనస్సు నిలుపు గమ్యం చేరతావు” అన్నారు బాబా. స్వతహాగా మన పసితనంలో స్వచ్ఛంగా మనం నవ్వి, ఇతరులకు ఆనందం కలిగించిన వాళ్ళమే, వయస్సు పెరుగుతూ, దానితోపాటు ఆలోచనలు, ఆశలు, ఆశయాలు పెరుగుతూ దుఃఖవలయాలలలో మునిగిపోయిన మనము, స్వతహాగా ఆనందజీవులమయిన మనము ఆనందంకోసం ఎక్కడికో పరుగులెత్తుతున్నాము. స్వతహాగా అయస్కాంత గుణము కలిగిన తుప్పుపట్టిన ఇనుప ముక్క అయినా అయస్కాంతము చెంతచేరినప్పుడు ఆకర్షింపబడినట్లు, హృదయాంతరాలలో స్వచ్ఛతా గుణము కలిగిన మనము స్వార్థంలేని పసివాడి నవ్వుచూసి పరవశించి ఆనందించేది అందుకు. పాడుబడ్డ మశీదులో గోనెగుడ్డ ఆసనముగా వేసుకొని, ఫకీర్లు, సాధువులతో జీవితాన్ని గడుపుతూ, ఐదు